క్లుప్తంగా

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

దుద్యాల్: ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టంలోని అంశాలు, రెవెన్యూ పరమైన సమస్యలు, వాటి పరిష్కారాల గురించి పూర్తి స్థాయిలో వివరిస్తామని చెప్పారు. ఈ సదస్సు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్: మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునఃప్రారంభోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అర్చకులు విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా ఆలయంలో పురోహితులు పూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, మండల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు అంజి, శివకుమార్, మధుయాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



తొర్మామిడిలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్

బంట్వారం: డాక్టర్.బీ.ఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తొర్మామిడి, యాచారం గ్రామాల్లో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కులమతాలకు అతీతంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమానమైన అవకాశాలు కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు కాపాడాలి

మోమిన్‌పేట: భారత రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో జై బాపు, జైభీం , జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సురేందర్, సుభాష్‌గౌడ్, సిరాజోద్దీన్, మహేందర్, సుభాష్, పర్మయ్య, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు సబ్సిడీ



సమావేశానికి హాజరైన రైతులు

కేశంపేట: రైతులు పామాయిల్ సాగు చేపట్టి ప్రభుత్వం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన అధికారి హిమబిందు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ.. పామాయిల్ పంటకు చీడపురుగుల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం పంట సాగుకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులే కొనుగోలు చేస్తారని వివరించారు. మూడేళ్ల వరకు అంతర పాటల సాగుతో అధిక ఆదాయం ఆర్జించవచ్చన్నారు. పంటలో వైరస్ సోకితే లింగాకర్షక బుట్టలను ఎకరానికి రెండు చొప్పున్న వాడాలని సూచించారు. ఎకరాకు ఎనిమిది నుంచి 12 టన్నుల దిగుబడిని సాధించవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, సుధ, నిఖిల్, రాజేశ్వరి, ప్రశాంత్, వాల్యూ అయిల్ కంపెనీ ఫీల్డ్ అధికారి నవీన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి

గ్రామీణులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆయా పల్లెల్లో వినియోగించుకుంటున్నారు. ఎండాకాలం పొలం పనులు లేకపోవడంతో అందరూ 'ఈజీఎస్'కు ఎగబడుతున్నారు.



హస్నాబాద్‌లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- తక్కువ సమయం కావడంతో ఆసక్తి చూపుతున్న కూలీలు
- పనులను పరిశీలిస్తున్న అధికారులు

దుద్యాల్: మండలంలో ఉపాధి హామీ పనుల జాతర జోరుగా కొనసాగుతోంది. పని చేసే సమయం తక్కువ కావడంతో అందరూ హామీ పనులపై మక్కువ చూపుతున్నారు. అలాగే ప్రస్తుతం వ్యవసాయ పనులు అందుబాటులో లేకపోవడంతో ఈ కేంద్ర ప్రభుత్వ పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ప్రభుత్వం జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క కూలీకి పనులు కల్పిస్తోంది. సకాలంలో వేతన బకాయిలు అందుతుండడంతో పనుల్లో పాల్గొనే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో ఆయా ప్రదేశాల్లో కూలీలు జాతరను తలపిస్తున్నారు. ప్రతి ఉపాధిహామీ కూలీకి 100 రోజుల పనిదినాలను ప్రభుత్వం కల్పిస్తుంది.

పనులు పుష్కలం

వేసవిలో ఉపాధిహామీ పనులు కల్పించడంపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నీటి కుంటలను తొవ్వడం, భూమి చదును చేయడం, గుంతలు తీయడం వంటి పనులు చేపిస్తున్నారు. మునుముందు వీరికి చెరువుల్లో ఒండ్రు మట్టిని తీయడం, పంట పొలాలకు నీరు ప్రవహించే ఏటి కాలువలను మరమ్మతులు చేయడం, ముళ్లపొదలు, చెట్లను తొలగించడం, అవసరం ఉన్న రైతుల పొలాల్లో చిన్న చిన్న రాళ్లను తొలగించడం వంటి పనులను కేటాయిస్తామని గ్రామాల్లో ఉండే ఆయా పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

గరిష్ఠం కూలీ రూ.307

2025–2026 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ కూలీలకు గరిష్ఠంగా రోజుకు రూ.307 వేతనాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. గతంలో రోజుకు రూ.300ల వరకు ఉండేది. దీంతో నిత్యం కూలీ పనిని బట్టి వేతనం లభిస్తుంది. కొలతల ప్రకారం రోజుకు కూలీని నిర్ణయిస్తారు. సరైన విధ్దంగా పనులు చేస్తే రూ.300 వరకు కూలీ లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు 3–4 గంటల వరకు పని సమయం ఉండడంతో గ్రామాల్లోని మహిళలు, యువత ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

మండలంలోని హస్నాబాద్ గ్రామంలో కొన్ని రోజులుగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పరిశీలించారు. కూలీలు సక్రమంగా పనులు చేస్తున్నారా? లేదా అనే కోణంలో తనిఖీ చేపట్టారు. ఉపాధి హామీ పనులకు రాకుండానే చాలా మంది హాజరు వేసుకుంటున్నారనే ఆరోపణ గతంలో ఉండడంతో పకడ్బందీగా చర్యలు చెపడుతున్నారు. మరోవైపు గ్రామంలో కూలీలు 15 గ్రూపులుగా ఏర్పడి 496 మంది ఉపాధి పొందుతున్నారు.

సింహగర్జనకు తరలిరండి



సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: ఓబీసీ సెంట్రల్ కమిటీ, జాతీయ బీసీ మహిళా సమాఖ్య అనుబంధ సంఘాలు సంయుక్తంగా మే 30న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మహిళా సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఈ సంఘం రాష్ట్ర చైర్ పర్సన్, ఆరెకటిక సమాజ్ కన్వీనర్ ఎం.భాగ్యలక్ష్మి కోరారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జాతీయ ఆదివాసీ గిరిజన ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.రమేశ్‌తో కలిసి శుక్రవారం కొడంగల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ప్రైవేట్ రంగాల్లో కూడా ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అన్ని వర్గాల స్త్రీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. సింహ గర్జనకు భారీ సంఖ్యలో మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారి శక్తి తెలంగాణ ఉపాధ్యక్షురాలు విమల, మైనార్టీ సెక్రటరీ హహ్మద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం అందజేత



నిర్వాహకులతో నినాదాలు చేస్తున్న భీంరాజ్

బొంరాస్‌పేట: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ సహకార గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.భీంరాజ్ సూచించారు. మండల పరిధిలోని కొత్తూరులో స్థానిక అంబేడ్కర్, కేఎస్‌పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఒకే వేదికపై ఛత్రపతి శివాజీ, మహాత్మా జ్యోతిరావుపూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను గురువారం రాత్రి ఆయన పరిశీలించి రూ.లక్ష విరాళం అందజేశారు. మహనీయుల చరిత్రను గ్రామాల్లో ప్రచారం చేయాలని పేర్కొన్నారు. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, అంజిలప్ప పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

కడ్తాల్: అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామని కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లాజీ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇటీవల పర్మిషన్ తీసుకోకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ మేరకు సర్వే నంబర్ 8లోని ఓ వెంచర్‌లో అనుమతి లేకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించామని, నిర్మాణం నిలిపివేయాలని నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. దీనిపై ఠాణాలో ఫిర్యాదు చేశామని చెప్పారు. పర్మిషన్ తీసుకున్న తర్వాతే ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు.

మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

బషీరాబాద్: మహిళా సమాఖ్య మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటైంది. సంఘం మండల అధ్యక్షురాలుగా బషీరాబాద్ గ్రామానికి చెందిన జానకీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం పద్మారావు తెలిపారు. మండల సమాఖ్య కార్యదర్శిగా సంపూర్ణ, కోశాధికారిగా స్వాతి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఎం వీరయ్య మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన అధ్యక్షురాలు జానకి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామ సంఘాలను బలోపేతం చేసేలా పనిచేస్తామన్నారు. ఆర్థిక చేకూర్పు కోసం చిన్నతరహా పరిశ్రమలను నెలకోల్పుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను అధ్యక్షురాలుగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

టేకులపల్లిలో బీరప్ప జాతర

మోమిన్‌పేట: మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో శుక్రవారం నుంచి బీరప్ప కామరతి–మల్లన్న జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం మల్లన్న బోనాలు, అన్నదానం, ఆదివారం బీరప్ప బోనాలు, అన్నదానం, సోమవారం బీరప్ప కల్యాణం, గావు పట్టుట, మంగళవారం నాగవెల్లి, బుధవారం బీర్లోళ్ల కడవలు కడుగుట తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతందన్నారు. అందరూ హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

పరామర్శ

బషీరాబాద్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నేత బిచ్చిరెడ్డిని శుక్రవారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి వెళ్లి బిచ్చిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ కోసం మొట్టమొదట బిచ్చిరెడ్డి ముందుండి ఉద్యమాన్ని నడిపించారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ ఆత్మహత్య చేసుకునేలా చేసిందని విమర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఉగ్రవాదులను తుదముట్టించాలి



యాలాల: మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు



బంట్వారం: కోట్‌పల్లిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన..

పరిగి: దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ఉగ్రవాదులు కుట్ర పన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మీర్ మహ్మద్ అలీ అన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ శుక్రవారం మసీద్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని మసీద్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతియుతంగా ఉన్న కశ్మీర్‌లో ఉగ్రవాదులు మరణకాండ సృష్టించారన్నారు. భారత దేశంలో అన్ని మతాలవారు అన్నదమ్ములుగా ఉన్నారని, అది నచ్చని ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. తీవ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌మోయిజ్, సభ్యులు సమీపటేల్, పాషా, మీర్ తాహేర్‌అలీ, మునీర్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి దుర్మార్గమైన చర్య

యాలాల: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని, ఈ విషయాన్ని తామంత ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని మండల మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం యాలాల మండల కేంద్రంతో పాటు రాస్నం గ్రామంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉగ్రదాడి పర్యాటకులపై జరిపిన దాడి కాదని, భారత్‌పై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ముష్కరులను పట్టుకొని బహిరంగంగా ఉరి తీయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గాజుల మన్నాన్, నాయకులు ఉన్నారు.

ఉగ్ర దాడులపై నిరసన

బంట్వారం: జమ్మూ కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ కోట్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మృతులకు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదాన్ని భూస్థాపితం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఉగ్రదాడులు అమానుషం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

దోమ: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అమానుషమని మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు ఖండించారు. శుక్రవారం మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో గ్రామస్తులతో కలిసి ఉగ్రదాడిలో మృతి చెందిన వారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుచ్చిలింగం, అమర్‌నాథ్‌రెడ్డి, యువజన సంఘం సభ్యులు ప్రకాష్ శ్రీశైలం, సాయి, మల్లేశ్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొడంగల్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కొడంగల్: గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయ్ కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ రైతువేదికలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, పలు సూచనలు అందించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బి గ్రేడ్‌కు రూ.2,300లు, సన్న వడ్లకు ఒక క్వింటాళుకు రూ.500 వరకు బోనస్ అందించనున్నట్లు తెలిపారు. దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా, ఏపీఎం వెంకన్న, సీసీ వాణిశ్రీ, గ్రామ సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..

కుల్కచర్ల: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఎం శోభ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, కోశాధికారి శ్రీలత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

కుల్కచర్ల: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, వైస్ చైర్మన్ నాగరాజు అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలంలో చౌడాపూర్, మరికల్, మల్కాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మద్దతు ధరను అందిస్తూ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కేంద్రాలను ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, నాయకులు శేఖర్, నర్సింహారెడ్డి, సత్యకుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

యాలాల: రైతులు ప్రభుత్వ మద్దతు ధరతో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నా రు. శుక్రవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో తిమ్మాయిపల్లి, జుంటుపల్లి, బెన్నూరు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోరాదన్నారు. అనంతరం తాండూరు డీసీఎంఎస్ మేనేజరుగా నియామకమైన అబ్దుల్ సలాంను ఏఎంసీ చైర్మ న్, సొసైటీ చైర్మన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మొగులయ్య, ఉదయ్ భాస్కర్, నాయకులు భీమయ్య, అమృతప్ప, మాజీ సర్పంచ్ పటేల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.



యాలాల: తిమ్మాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

యాలాల: మహిళలు ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ పుష్పలీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల మహిళ సమాఖ్య 13వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు చిన్న చిన్న వ్యాపారులు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పాటు పడటం సంతోషకరమన్నారు. గ్రామాల్లో గ్రామసంఘాలు, వడ్డీలేని రుణాలతో వ్యాపారాలు, బ్యాంకు లింకేజీ రుణాలతో గ్రామీణ మహిళలకు ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు.

కొత్త పాలక మండలి ఏర్పాటు

మండల మహిళ సమాఖ్య కొత్త పాలకమండలిని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షురాలిగా వనమాల(విశ్వనాథ్‌పూర్), కార్యదర్శిగా కమల (బషీర్‌మియాతండా), కోశాధికారిగా నవనీత(ముద్దాయిపేట)లను మూడేళ్ల కాలానికి ఎన్నుకున్నారు. డీపీఎం వీరయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల, సీసీలు బందెయ్య, వెంకటయ్య, నర్సింహులు, రాజశ్రీ, సిబ్బంది చిరంజీవి, షఫీ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వల్ల ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ ఆలస్యం లేకుండా అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప అన్నారు. ఈమేరకు రేగడిమైలారంలో ఈడ్గి ప్రభాకర్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందుల పాలయ్యాడు. దీంతో సీఎంఆర్ఎఫ్ కింద రూ.50 వేలు మంజూరయ్యాయి. చెక్కును బాధితుడి భార్యకి అందజేశారు. మండల వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ ఎక్కువ మొత్తంలో మంజూరు కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు కుమ్మరి గుండప్ప, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటయ్య, శ్రీశైలం, శేరి సాయిలు, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌లో షాద్‌నగర్ విద్యార్థి సత్తా

విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానం

షాద్‌నగర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ జడ్జి మనోహర్, రిటైర్డ్ సీడీపీఓ నాగమణి దంపతుల కుమారుడు భరద్వాజ్ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో 905 ర్యాంకును సాధించారు. భరద్వాజ్ 1 నుంచి 10వ తరగతి వరకు పట్టణ సమీపంలోని మరియారాణి శాంతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. శుక్రవారం భరద్వాజ్ కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. భరద్వాజ్ ప్రస్తుతం ఢిల్లీలో ఇంటలిజెంట్ బ్యూరోగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థి భరద్వాజ్ ఉన్నత విద్యను అభ్యసించి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకు సాధించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మనోహర్, నాగమణి దంపతులు